కథ 1994

10



# వలస పక్షులు

గొరుసు జగదీశ్వరరెడ్డి

గగనంలోని పక్షులు మరో చోటికి వలస వెళ్లినా స్వేచ్ఛగా తిరుగాడుతూ వాటి పొట్టలు నింపుకొని కొన్నాళ్లకి తిరిగి సొంత గూళ్లకి చేరుకుంటాయి.

కానీ, పాలమూరి పక్షులు రెక్కలు ముక్కలు చేసుకుంటూ, డొక్కలు మాడ్చుకుంటూ, మేస్త్రీలనూ, కాంట్రాక్టర్లనూ మేపడానికి వలస వెళ్తుంటాయన్న యథార్థం ఎందరికి తెలుసు?

జాతులు వేరైనా రెండూ ప్రకృతిలోని జీవులే. మొదటివాటికున్న స్వేచ్ఛ రెండోవాటికి లేకపోవటం ఎందుచేత?

ఎందుకీ వ్యత్యాసం?

ఎవర్రాసినదీ ద్వంద్వనీతి?

*

''ఇంటర్‌కామ్‌లో మిమ్మల్ని కాన్ఫరెన్స్ హాల్‌కు రమ్మని పిలుపు వచ్చింది సార్!''

మిషన్ బ్రేక్‌డౌన్ మెమో రాస్తున్న నేను తలెత్తి చూసేను. నా ఎదురుగా వున్న మా సూపర్‌వైజర్ తిరిగి ఆ మాటనే మళ్లీ చెప్పేడు.

''ఓ.కే. ఈ మెమో పూర్తిచేసి, ప్లాంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు పంపండి,'' అంటూ కాన్ఫరెన్స్ హాలు కేసి నడిచాను.

''మే ఐ కమిన్ సార్,'' స్ప్రింగ్ డోర్ తెరుస్తూ అన్నాను.

''రండి బాల్రాజ్‌గారూ, రండి!'' మా అసిస్టెంట్ మేనేజర్ ఆహ్వానించేడు.

అక్కడి వాతావరణం చూడగానే వారంతా నన్నెందుకు రమ్మన్నారో వెంటనే అర్థమైపోయింది.

నేను వెళ్లి ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాను.

మా ఏ.ఎం.తోపాటే సీనియర్ మేనేజర్, కాంట్రాక్టర్ కృష్ణారావూ వున్నారు.

అంతా కొద్దిసేపు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లుగా మౌనంగా వుండిపోవటంతో అసహనంగా కుర్చీలో కదిలేను. ఆ వాతావరణం చిరాగ్గా వుంది. నాలో రంగులు మారటం గమనించిన మా ఏ.ఎం. ముందుగా తేరుకొని-

''బాల్రాజ్!... మీతో కాంట్రాక్టర్ కృష్ణారావు ఏదో మాట్లాడాలనుకుంటున్నారు'' చిన్నగా నవ్వుతూ సంభాషణ మొదలుపెట్టేడు.

''అవును బాల్రాజ్! మీ ధోరణిలో మార్పులేక పోవటం ఏం బాగోలేదు. డిపార్ట్‌మెంట్‌లోకి కొత్తగా వచ్చారు. ఈ స్టీల్ ప్లాంట్‌లో మీరు జూనియర్ మేనేజర్ కావచ్చును. కానీ, ఇలా మా కాంట్రాక్టర్లకు సంబంధించిన విషయాల్లో జోక్యం అనవసరం అని తెలీదా?''

కృష్ణారావు మాటలకు నా పిడికిళ్లు బిగుసుకున్నాయి. కళ్లల్లోకి రక్తం పొంగుకు వచ్చింది. మన సంతా కుతకుతలాడింది. ఒక్కసారిగా ఉప్పెనలా పెల్లుబికిన ఆవేశాన్ని అదుపులో ఉంచుకున్నాను.

అతని మాటలకు వొత్తాసు పలికినట్లుగా మిగతా స్టాఫ్ నా జవాబు కోసం చూస్తున్నారు.

''మీరంతా ఎందుకింత నిర్దయతో వున్నారో అర్థం కావటం లేదు. నూకాలమ్మ ఆక్సిడెంట్ విషయం మీలో ఎవరికీ సీరియస్‌గా అన్పించకపోవటం ఆశ్చర్యంగా వుంది. ఆమె కృష్ణారావు వద్ద చాలా సీనియర్ లేబర్. నెలరోజుల క్రితం షాప్‌ఫ్లోర్ ఊడుస్తూ మనవాళ్లు నిర్లక్ష్యంగా పారబోసిన లూబ్రికేటింగ్ ఆయిల్‌పైన జారి, కాలుని విరగ్గొట్టుకుంది. వారానికో సేఫ్టీ మీటింగ్

పెడ్తూ, వర్కర్స్‌కి భద్రతలో శిక్షణలు ఇప్పిస్తున్నా, వాళ్లు చేసేది వాళ్లు చేస్తూనే వున్నారు. మనవాళ్లు చేసిన నిర్వాకానికి అరవై సంవత్సరాలు దాటిన ఆ ముసలమ్మ కాలు విరగ్గొట్టుకుంటే తన అండర్‌లో పని చేస్తున్న లేబరనే స్పృహ లేకుండా ప్రవర్తించేడు. ఆమెను కనీసం ఆస్పత్రికైనా తీసుకెళ్లకపోవటం ఎంత దారుణం! సాటి మనిషిగా ఎవరైనా స్పందిస్తారు. ఆమె తరపున వాదించానని కృష్ణారావుకు నాపైన కోపం...'' కుర్చీ లోంచి లేవబోయేను ఆవేశంగా.

''మా లేబర్ విషయంలో మా శ్రద్ధ గురించి మీరు మాకు చెప్పక్కర్లేదు బాలాజ్! వాళ్లకు ఏ ట్రీట్‌మెంట్ అవసరమో మాకు తెలీదా?'' కృష్ణారావు మాటల్లోని వ్యంగ్యం నన్ను రెచ్చగొట్టినా, కాసేపు మౌనంగా వుండి పోయేను.

నా కోపం అంతా బాధగా మారుతోంది.

''మీ కాంట్రాక్టర్లు ఎంత మంచివారో నాకు తెలీదా సార్? విశాఖ ఉక్కులోకి మీరు ఈమధ్య ఫ్లోర్లో క్లీనింగ్ కాంట్రాక్టర్‌గా రంగప్రవేశం చేసేరు. కానీ బాల్యం నుండీ ఈ ఉక్కు పొరల్లో, ఈ పునాదుల అరల్లో నా జీవితాన్ని నిక్షిప్తం చేసినవాణ్ణి.

''ఇప్పుడిలా మనమంతా హాయిగా జీవితాన్ని గడపడానికి కారణమైన ఈ స్టీల్‌ప్లాంట్ ఉక్కు పొరల్లో ఎన్ని జీవితాలు బలయిపోయి వున్నాయో మీకెలా తెలుస్తుంది? ఇప్పుడు వేల సంఖ్యలో వున్న కార్మికులను, మేనేజ్‌మెంట్ స్టాఫ్‌ను, మీలాంటి కాంట్రాక్టర్లనూ పోషిస్తూ, అందరికీ అందుబాటుగా క్వార్టర్లనూ, స్కూళ్లనూ, ఆస్పత్రులనూ ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్, అందమైన రోడ్లతో, పచ్చని వృక్షాలతో ఇప్పుడున్న ఈ వైభవం వెనక ఎంత చరిత్ర వుందో తెలీదు మీకు.

''ఈ ప్రాంతంలో ఎన్నో పల్లెలు వుండేవనీ, ఆ పల్లెల్ని, ఎత్తయిన దిబ్బలనీ ఛిద్రం చేసి, లోతట్టు ప్రాంతాల్ని 'ఫిల్' చేసి... రెక్కలు ముక్కలు చేసుకుంటూ, పిడికెడు నూకల మెతుకుల్లో చిటికెడు కారపు పొడి వేసుకు తింటూ, డొక్కలు మలమల మాడుతున్నా మనకోసం అహర్నిశలూ శ్రమించి, ఈ స్టీల్ ప్లాంట్‌కు నాందీ రూపాన్ని ఇచ్చింది పాలమూరి లేబర్.

''మీలాంటి కాంట్రాక్టర్లు, మేస్త్రీలు, ఆ అమాయక పక్షుల మెడలూ, కాళ్లూ విరిచి, రక్తాలు తాగి, కాల్చుకు తిన్నారనడానికి సాక్షిని నేను.

''ఇంకా ఈ మట్టి పొరల్లో నా తల్లి సజీవ సమాధి అయ్యిందన్న నగ్నసత్యం మీకు తెలిసినా, తెలియక పోయినా, ఆ జీవాత్మ ఇక్కడే సంచరిస్తోందన్న ఆశతో... జీవిస్తున్నాను...'' గొంతులో ఏదో అడ్డుకున్నట్లు ఆగిపోయేను.

నా కంఠంలో జీర!

గుండెలోంచి తన్నుకొచ్చిన దు:ఖం- కళ్లల్లో చిప్పిల్లిన నీరు వాళ్లకు కన్పించకుండా తల వంచాను.

అమ్మ జ్ఞాపకాల విస్ఫోటం మెదడంతా చిమ్ముకునేసరికి నన్ను నేను సంబాళించుకోవటం కష్టమయింది.

''చట్టరీత్యా రోజుకి ఎనిమిది గంటలు పనిచేయాలని రూల్స్ వున్నా, అవన్నీ ప్రభుత్వం తరపు చట్టాలే! పాలమూరి లేబర్ విషయంలో రోజుకు పన్నెండు గంటల వరకూ పని కాలాన్ని పొడిగించిన మేస్త్రీలూ కాంట్రాక్టర్లూ వారి చెమటని జలగల్లా పీల్చిన సంగతి మీకెలా తెలుస్తుంది?

అందరి ముఖాల్లోనూ రంగులు మారుతుండడం గమనించేను. చాలాసేపు ఎవ్వరం మాట్లాడుకోలేదు.

ఓ పాలమూరి కూలీగా ఇరవై సంవత్సరాల క్రితం ఈ విశాఖ నేలపైన అడుగు పెట్టిననాటి నుండీ, ఇప్పటివరకూ నా జీవితంలో జరిగిన పెనుమార్పుల్ని ఈ సందర్భంలో వాళ్లతో సంభాషించడం అయిష్టంగా వున్నా, కృష్ణారావులో ఏ మూలో దాగివున్న మానవత్వం కనీసం తొంగిచూసి, నూకాలమ్మకు సహాయ పడుతుందేమోనన్న ఆశతో కొంతయినా వాళ్లకు చెప్పాలనిపించింది.

*

తెలంగాణకు నైరుతి దిశలో వుండి, కరువు కాటకాలకు, వలసలకు ఆలవాలమైన మహబూబ్ నగర్ జిల్లాలోని ఓ గ్రామంలో పుట్టిన నాకు ఊహ తెలిసిందీ ఆ గడ్డపైనే.

నాకప్పుడు పదేళ్ల వయసు. ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ నన్ను నీడలా వెంటాడుతూ వుంటాయి. అవే నా జీవనయాత్రకు దిక్సూచులుగా వున్నాయి.

నాన్న ఒక మేస్త్రీ దగ్గర లేబర్‌గా చేసేవాడు. తాపీ పనిలో నాన్న దిట్ట. తమ శ్రమకు సరయిన ఫలితం లభించకపోయినా, కసాయిని గొర్రె నమ్మినట్లుగా కాంట్రాక్టర్లనూ, మేస్త్రీలనూ నమ్ముతూ ఒళ్లు వంచి పనిచేసే అమాయక జీవులు పాలమూరి లేబర్.

అనుకోనివిధంగా నాన్నకు జబ్బు చేసింది. అది కేన్సర్ అని తెలిసేసరికి సమయం మించిపోయింది.

నాన్నని బ్రతికించుకోవటంకోసం అమ్మ ఎంతో తాప త్రయపడేది. చివరికి నాన్న దక్కకపోయినా, ఆయన్ని కళ్ల ముందు చూసుకోవాలని అమ్మ చేసిన మూడువేల అప్పు మాత్రం మిగిలింది.

అమ్మ ఆ ఊళ్లో చేయని పనంటూ లేదు. తనతో పాటూ, నా పొట్ట కూడా నింపటం కోసం వరిపొలాల్లో నాట్లకూ, కలుపుతీతకూ, కోతలకూ వెళ్లేది. వేరుశనగ కాయల్నుండి పలుకులు వేరుచేయటం, చింతబోట్లను పండు రూపంలోకి మార్చటం, అడవి నుండి కట్టెలు తెచ్చి అమ్మటం, పేడను కూడేసి, పిడకలు చేయటం... ఇన్ని కూలిపనులు చేస్తూనే నన్ను బడిలోకి పంపు తుండేది అమ్మ.

మేస్త్రీ దగ్గర తీసుకున్న అప్పు రాన్రానూ వడ్డీతో కలుపుకుంటూ పాపంలా పెరిగిపోతోందన్నది ఆ తర్వాతగానీ తెలీలేదు.

ఆ అప్పును తీర్చటం కోసం అహర్నిశలూ తను తన శక్తినంతా ధారపోసేది. అయినా వచ్చే కూలీతో మాకిద్దరికీ తినడానికే కటకటగా వుండేది.

ఒకరోజు మాకు అప్పు ఇచ్చిన మేస్త్రీ వచ్చేడు.

"ఇగో రాములమ్మో, ఇగ నా అప్పుదీర్చుడు నీ వొశం గాదుగానీ, లేబర్‌ను బంతి గట్టి దేశం తోల్క పోతున్న. ఇశాకపట్నం కొండపోతున్న. నీవు గాడికొచ్చి ఆర్నెల్లు కూలి జేసినవంటే నా అప్పు, దానిమీది మిత్తి పైసలు మట్టగ దీర్తయ్. నీవు గూడ గీ బాల్రాజ్ గాన్ని తోల్కోని బంతిల గలువు..." అంటూ మెడ మీద కూర్చొని అమ్మని బలవంతంగా ఒప్పించేడు. చేసేదేం లేక అప్పు తీరే మరో మార్గంలేక అమ్మ బంతిలో కలవడానికి ఒప్పుకుంది.

మరో రెండ్రోజుల్లో అమ్మతోపాటే తట్టా, బుట్టా సర్దుకొని, పాలమూరి లేబర్‌గా ప్రైవేట్ బస్ సర్వీస్‌లో విశాఖనగరానికి బయల్దేరి వచ్చాను.

నాకు కొద్దికొద్దిగా జ్ఞాపకం ఉంది.

ఎన్నో గంటల ప్రయాణం తర్వాత, ఓ తెల్లవారు జామున విశాలమైన స్థలంలో బస్ ఆగింది.

అంతవరకూ ఎక్కడికీ ప్రయాణం చేయని నేను అన్ని గంటలు బస్సులో వుండటం అదే మొదటిసారి. మాతోపాటూ ఆ బస్సులో నుండి మరో అరవైమంది లేబర్ దిగేరు. మేం బస్సు దిగేసరికి మా కోసమే ఎదురు చూస్తున్నట్లుగా ఒక నర్సు, కాంపౌండర్లతో కాంట్రాక్టర్ వున్నారు.

అందర్నీ వరసగా నిల్చోబెట్టి ఇన్‌ఫెక్షన్ రాకుండా ఇంజక్షన్ చేసేరు.

ఆ తర్వాత మేస్త్రీ మమ్మల్నందర్నీ మరో చోటికి తీసుకెళ్లి, అక్కడ మేం ఎవరికి వాళ్లం తెచ్చుకున్న సామాగ్రితో గుడిసెల్ని కట్టుకోమన్నాడు. రేపట్నుండీ తెల్ల వారు జామున నాలుగు గంటలకే పనిలోకి వెళ్లాలని హెచ్చరిస్తూ, మాకు కాస్త దూరంలో వెదురుకర్రలతో, తడకలతో కలిపి చిన్న గుడిసె వేసుకున్నాడు. మేస్త్రీతో పాటూ అతని భార్య కూడా వచ్చింది.

గుడిసె వేయటంలో అమ్మకు నా చేతనైన సహాయం చేశాను. అమ్మ రావడమైతే వచ్చింది కానీ మనిషి చాలా దిగులుగా వుండటం గమనించేను.

*దేశం గాని దేశం దీసుకొస్తి కొడుకా!*
*నిన్ను సాలెమాన్పిస్తి కొడుకా....*
*నా మీద మన్ను వొయ్య....*
*నీ కన్యాలం జేస్తి కొడుకా....*

అమ్మ శోకాలు తీస్తూ, నన్ను చుట్టేసి బావురు మన్నది. నేను బిత్తరపోయి అమ్మతోపాటే శృతి కలిపేను.

"ఊకో, రాములమ్మా! సన్నవిలగాడు బెదురుకో గలడు. మన రాతలు బాగలేకనే గీదేశంలొచ్చిపడ్డం. ఇగేడ్వకుతియ్..." మాతో వచ్చిన తోటి లేబర్ అమ్మను ఊరడించేరు.

వారంతా కూడా పిల్లా, జెల్లా, తట్టా, బుట్టతో మాలాగే జీవితంతో యుద్ధం చేయడానికి వచ్చినవారే!

ఆ మర్రోజు తెల్లవారుతుండగా మేస్త్రీతో ఏ ప్రాంతంలో తవ్వకం మొదలుపెట్టి, ఏ లోతట్టు ప్రాంతంలో 'ఫిల్' చేయాలో చూపించి, మరికొన్ని విషయాలు మాట్లాడి వెళ్లేడు కంట్రాక్టర్.

మొదట్లో అమ్మ పని చేస్తుండగా నేను తక్కిన కూలీల చిన్న చిన్న పిల్లలందర్నీ పోగుచేసి ఆడిస్తూ దూరంగా వుండేవాణ్ణి.

మగ కూలీలు గునపాలతో తమ శక్తినంతా ధార పోస్తూ, మట్టిని 'సొచ్చెలు'గా చేస్తూ, ఒకేసారి రెండు మూడు ట్రాక్టర్లకు సరిపడే మట్టిని తయారుచేసేవారు.

ట్రాక్టర్లు వచ్చి ఆగడానికి 'రాంపు' అంటూ వాటి టైర్లు దిగేలా రెండు బాటలు చేస్తూ, అందులోకి ట్రాక్టర్ రాగానే కూలీలు మట్టిబోయటానికి అనుకూలంగా చేసుకునేవారు.

విశాఖ వచ్చి వారం దాటింది.

కొంత ఆ వాతావరణానికి అలవాటు పడ్డాము. కానీ అమ్మ మాత్రం ఏదో మనోవ్యాధితో ఉన్నట్లు, లోలోన కృంగిపోతున్నట్లు కనిపించేది నాకు.

రోజూ సూర్యోదయంకన్నా ముందే నిద్రలేచి పని లోకి వెళ్లటం, సూర్యాస్తమయం అయ్యేక రెండు

గంటల తర్వాత గుడిసెలకు చేరుకోటం... మా దిన చర్య.

కనుచూపుమేర ఎక్కడ చూసినా ఎందరో కూలీలు పనిచేయటం కన్పించేది. మేమున్న జోన్ వదిలి, అప్పుడప్పుడూ మా చుట్టుపక్కల వున్న మిగతా జోన్స్‌కి కూడా వెళ్లేవాణ్ణి.

పాలమూరి లేబర్ కాకుండా శ్రీకాకుళం, ఒరిస్సా లోని బరంపురం నుండి వచ్చిన కూలీలు, అప్పుడప్పుడూ ఒంగోలు నుండి వచ్చినవాళ్లూ.... కన్పించేవారు.

ఎక్కువ శాతం పాలమూరి లేబరే వుండేది.

ముఖ్యంగా ఇతర లేబర్ మాట్లాడే యాస నాకు చిత్రంగా అన్పించేది. బరంపురం లేబర్ దగ్గర కాషాయం, ఎరుపు కలిపిన ఒకరకమైన రంగులోని గుడ్డలు వుండేవి. వాటిని మొలలకి, తలలకీ, భుజాల మీదకీ వాడేవారు.

పసుపు, బూడిద కలిపినట్టు ఒక రకమైన పాలి పోయిన రంగులో, ముఖం మీద రోమరహితంగా వుండేవారు.

స్టీల్ ప్లాంట్ అంతా రణగొణధ్వనులతో సందడిగా వుండేది. ఎక్కడ చూసినా రాక్షస బల్లుల్లాంటి మట్టిని తీసిపోసే షవల్స్, మట్టిని మోస్తూ తిరిగే ట్రిప్పర్స్, డోజర్స్ పసుపు రంగులో పులుల్లా కన్పించేవి.

ఇక ట్రాక్టర్లు, లారీలూ లెక్కలేకుండా తిరుగుతుండేవి. పుట్టలు పెడుతున్న చీమల బారుల్లా, పుట్టలు పగిలి చెల్లాచెదురైన చెదపురుగుల్లా కూలీలు గజిబిజిగా వుండేవారు.

కూలీలు ఎన్ని ట్రాక్టర్లకు, లారీలకూ మట్టిని నింపుతున్నారో లెక్కలు రాయడానికి తాత్కాలికంగా సూపర్‌వైజర్స్‌ని కాంట్రాక్టర్లు నియమించేవారు. వారంతా మాతోపాటే వుంటూ మా పనితీరునూ, మా మాటలోని యాసనూ గమనిస్తూ, నవ్వుకుంటూ మాలాగే మాట్లాడాలని ప్రయత్నించేవారు.

సూపర్‌వైజర్స్‌కీ, కాంట్రాక్టర్లకీ జోన్ ప్రకారంగా వెదురు, తాటితో కట్టిన కాటేజీల్లాంటివి ఉండేవి.

వాళ్లకి భోజనవసతి కోసం జోన్స్‌లో తమిళ, మలయాళీయులు చిన్న చిన్న హోటల్స్, డాబాలు నడిపేవారు.

రోజూ పది, పదకొండు గంటల ప్రాంతంలో మేస్త్రీ భార్య అన్నం, కూరలు చేయించుకోని తీసుకు వచ్చేది. రోజూ మేం తినేది నూకల అన్నం. అందులోకి వెల్లుల్లితో చేసిన మిరప్పొడికారం అంతే! వారానికోసారి గోంగూరతో చేసిన పప్పు. నెలకోరోజు మాత్రం సెలవు దినం.

ఆ సెలవునే 'మానకం' అంటూ, శనగల్ని, పెసర్లనీ, అనుముల్ని ఉడికించి గుగ్గిళ్లుగా చేసుకు తినేవాళ్లం.

స్టీల్ ప్లాంట్ నెలవు కోసం ధ్వంసం అయిపోయిన ఎన్నో పల్లెలు... కళ్ల ముందే ఒక్కొక్కటీ అదృశ్యం అవటం ఆ బాల్యంలోనే నా మనసుని కలిచివేసేది.

ఆ గ్రామాల్లోని జనమంతా గంట్యాడ, గాజువాక, ఆ చుట్టు పక్కల ప్రాంతాలకి తరలివెళ్లారు.

అప్పుడప్పుడూ మేముండే జోన్స్‌కి కొందరు ఆడవాళ్లు వచ్చి, మా ముందే టీ, కాఫీలు తయారుచేసి, వాటితోపాటు పునుకులు, బూరెలు, జీళ్లూ, పెండలం దుంపలూ, బన్నులూ అమ్మేవారు.

ఆరోజు అమ్మకు ఒంట్లో నీరసంగా వుండి, పని చేయజాలక కాస్సేపు కూర్చుంది. మామూలుగా అన్నం తీసుకువచ్చే మేస్త్రీ భార్య వస్తూనే అమ్మను అలా చూస్తూ మండిపడింది.

"ఏందే రాములమ్మా, గట్ల పెండ్లోల్ల ఇంటి కొచ్చిన తీర్గ కూసున్నవ్? లేవు తల్లీ , దబ్బున తట్టలు దీసుకో," పెద్ద గొంతుతో అరిచింది.

"జెర పానం బాగలేదు మేస్త్రమ్మా! దినాం కష్టం జేస్తనే వున్న గదనమ్మా? పెయిల బాగుంటే గిట్ల గూసుంటనా?"

అమ్మ మాటలకు ఆమె శివమెత్తింది.

"ఏమయ్యో! గిది జూసినవా ఎట్ల తిరిగి జవాబిస్తుండదో, బాగనే దెచ్చినవ్ గిసంటోళ్లను. ఇగ నీ అప్పు దీరుస్తదా? దినాం కుత్కెలదాంక మేపుతుండగదా! మస్తుగ తిని, ఆరాంగ గూసున్నది దుడుకది," భర్త మీద ఎగిరింది.

"ఏం తిండి తల్లీ... పిడికెడు నూకలన్నంల, మిర్పొడి ఏసి పెడ్తున్నవ్. కడుపుల మంటలేసి సస్తుండ," అమ్మ నీరసంతోనే ఎదురుమాట్లాడింది.

"ఏయ్! నోర్మూయ్ రాములమ్మా! లేవ్, లేసి తట్టల్దీసుకో. అగో, కాంటాక్టరు వస్తుండడు. గాయన ఇచ్చిన టైంల పనిగాకుంటే, ఇచ్చే దుడ్లుగూడ ఇయ్యడు." అమ్మ పైకి అంతెత్తున ఎగిరేసరికి నాకు ఎక్కడలేని కోపం వచ్చింది వాళ్లపైన.

ఇక ఎదురుచెప్పలేని అమ్మ, ఆ నీరసంలోనే మెల్లగా నిల్చుని, పార, తట్ట తీసుకుంది. మేస్త్రీ భార్య అందరికీ అన్నం వడ్డించి, నాకు, అమ్మకు పెట్టకపోయేసరికి... ఒకరిద్దరు కూలీలు అడగబోయారు.

వాళ్లను పచ్చి బూతులు తిట్టేడు మేస్త్రీ.

ఆ సాయంత్రానికే అమ్మకు శోషవచ్చి పడిపోయింది. ఉదయం నుండీ మాతోపాటే జోన్‌లో 'టీ' అమ్మే ఆడమనిషి గబగబ వచ్చి, అమ్మ ముఖం మీద నీళ్లు చిలకరిస్తూ కాసేపు ఉపచర్యలు చేసింది.

తన దగ్గరున్న బన్నును టీలో ముంచి అమ్మకు తినిపించింది. నాకూ తన దగ్గరున్న పుణుకుల్ని, జీళ్లనీ ఇచ్చింది.

''నా ఒద్ద దుడ్లులేవు తల్లీ! నీ కాల్మొక్త.... మేస్త్రమ్మకు కోపమొచ్చింది. నాకు పెట్టకుంటె వాయె. గీ సన్నవిలగాడు ఏంజేసిండమ్మా.... నా నాయనకు ఎన్ని కష్టాలొచ్చినయ్ దేవుడా!'' అమ్మ ఏడుస్తూనే, ఆమెను బ్రతిమాలింది.

''అచ్చీ! నాను డబ్బుల్కీయినేదమ్మా. నాను పొద్దు టేల్నుంచీ సూత్తన్నాను గందా, అది మడిసి జెలమ ఎత్తనేదమ్మా! రెక్కలు ముక్కలు సేసుకంతన్నావు- కని కారం నేకపోనాది ముండకి,'' అంటూ ఆమె మాట్లాడిన తీరు సరిగా అర్థం కాకపోయినా మాపైన తనకెంతో జాలి వున్నట్లు తెలుస్తోంది.

''నన్ను ముత్యాలమ్మంతారు. అల్లక్కడ ఆగుపిత్తంది సూడుమీ. ఊరంతా పడగొట్టీసి, మొండి గోడల్తో, మద్దిన రాములోరి కోవిలా....అద్గదీ నెల్లుముక్కు. ఆ ఊరే మాది. మావందరవీ ఇల్లులు కాలీసేస్సి, గాజువోకనోనుంతన్నాము. మీకు తెల్దుగానీ ఇల్లిక్కడ్నుంచీ అల్లక్కడ సవుద్రంకేసి అగుపించే గంగోరం దాకా బోల్డు ఊళ్లుండీవి. ప్చ్. ఏట్నాబం! అన్నీ పడగొట్టీసినారు. ఇందనోని టీల్‌పాంటు కట్తారటమ్మా...'' మాకు అర్థం అయ్యీ, కానీ విశాఖ యాసలో ముత్యాలమ్మ మాట్లాడ్తూ వుంటే సంభ్రమంగా చూసేవాణ్ణి.

ఆమె ఒంటి మీద చీరకొంగుని కుడివైపున వేసుకునేది. జాకెట్ లేకుండానే వుండేది. తలనిండా ఆముదం రాసుకొని, కొప్పుని ఒకపక్కగా కట్టేది. ముఖంలో రూపాయికాసంత ఎర్రని బొట్టు, ముక్కుకి వేలాడే బులాకీ, చెవులకి బుట్టలు, అప్పుడప్పుడు పొగాకు చుట్టల్ని తాగుతూ, కాల్తున్న వైపుని నోట్లోకి పెట్టేసి అడ్డపొగ పీల్చటం...ఆమెకు ఎదురుగా కూర్చుని వింత మనిషిని చూసినట్లు చూసేవాణ్ణి.

మరికొన్ని రోజుల్లోనే ముత్యాలమ్మతో మాకు చనువు ఏర్పడింది. మేం డబ్బుల్ని ఇవ్వకపోయినా అమ్మకూ, నాకూ రోజూ 'టీ' పోస్తూ, తిండానికి ఏమైనా ఇచ్చేది. అప్పుడప్పుడూ ముత్యాలమ్మతో 'టీ కేన్' పట్టుకొని తక్కిన జోనుల్లోకి వెళ్లేవాణ్ణి. ముత్యాలమ్మకి పిల్లలు లేరు. ముప్పయి ఏళ్లు దాటి వుంటాయి. తన భర్త ఎలక్ట్రిసిటీ 'పోల్స్' పాతుతాడనీ, వైరింగు పనేదో చేస్తాడనీ చెప్పింది.

తినడానికి తమకేలోటు లేకపోయినా, మనిషికి వ్యాపకం అంటూ లేకపోతే పిచ్చెక్కుతుందని, సరదాగా ఇలా జోనులు తిరిగి చిన్నగా టీ వ్యాపారం చేయటంలో ఆనందం వుందనేది.

నాన్నకై చేసిన అప్పు మీద వడ్డీ రోజు రోజుకూ పెరిగిపోతోంది. కూలీ చేసన్తూ, రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా, మేస్త్రీ రోజుకోసారి-

''రాములమ్మా, అప్పు తీర్వాల్నంటే గీడ యాడాదన్న పనిజేయాలె,'' అనేవాడు.

'పాలమూరిలో కలో, గంజో తాగి బతుకుదం గానీ, ఈ గాడిది చాకిరి వద్దురా భగవంతుడా!' అనుకునే అమ్మ మేస్త్రీ మాటలకు హతాశురాలయ్యేది.

నేను అప్పుడప్పుడూ ముత్యాలమ్మతో కలిసి బాల చెరువు సంతకి వెళ్లేవాణ్ని. అక్కడ ఎన్నో రకాల చేపలు. పాలమూర్లో కొరమట్టలు, పరకలు, బొచ్చలు, రవ్వలు తప్పించి మరే రకం చేపలు చూసెరగను.

సొర్రలు, వంజురం, సందువాలు, కవ్వల్లు, కారలు, సావల్లు, పీతలు, రొయ్యలు... ఇట్లా చిత్రమైన చేపల పేర్లు చెప్పేది ముత్యాలమ్మ.

సంతలో తాటి తేగల్ని కొనిపెట్టి, వాటిని ఎలా తినాలో చెప్పేది.

ఎందుకో.... అమ్మ ఆరోగ్యం రాన్రానూ క్షీణించ సాగింది. ముత్యాలమ్మ అప్పుడప్పుడూ నన్ను గాజువాకలోని స్కూల్‌లో చదివించమనీ, వీలుకాకపోతే తన ఇంట్లోనే నన్ను వుంచమనీ అమ్మతో చెప్పేది.

''ముద్దుగ సదువుకు సాలెకు వొయెటోన్ని దెచ్చి, గీడ పనిజేపిస్తున్న ముత్యాలమ్మా! మా బత్కులుల్ల మన్నువడ. మా మీన దేవుడు గింతగనం కచ్చవట్టిండు ఏమిటికో....'' అమ్మ తన మనసులో ఆవేదనని వెళ్లగక్కేది.

*

స్టీల్ ప్లాంట్‌కు వచ్చి దాదాపుగా నాలుగు నెలలు దాటింది.

మేస్త్రీలు పెట్టే తిండిని తినలేక, ఈ పన్నెండు గంటల కష్టం చేయజాలక కొందరు కూలీలు దొంగ చాటుగా తప్పించుకొని, పాలమూరు పారిపోవటంతో కలకలం రేగింది.

ముందుగా అడ్వాన్స్‌లు ఇచ్చి, లేబర్‌ని తీసుకు వస్తే, చెప్పా పెట్టకుండా పారిపోవటంతో మేస్త్రీ పచ్చి బూతులు గుప్పిస్తూ, పిచ్చెక్కిపోయేడు.

జనం తక్కువయ్యేసరికి, పని మందకొడిగా సాగేది.

కాంట్రాక్టర్ మేస్త్రీపైన విరుచుకుపడేవాడు.

'అనుకున్న టైంలో పని పూర్తిచేయకపోతే, డబ్బులు ఇవ్వడం కుదరదని,' బెదిరించేవాడు. కాంట్రాక్టర్ నుండి వత్తిడి పెరగటంతో మేస్త్రీ మా మీద పడేవాడు.

అమ్మకు ఆరోగ్యం సరిగా లేకపోయినా, రోజూ పన్నెండు గంటలు తట్టలు మోసేది.

మేం వుంటున్న పక్క జోన్‌లో మా ఊరి లేబరే కొందర్ని మరో మేస్త్రీ బంతి గట్టుకొని వచ్చేడు. ట్రాక్టర్ నిండా మట్టిని నింపి, ఫిల్లింగ్ ఏరియాలో 'అన్‌లోడ్' చేయడానికి బయల్దేరినప్పుడు, ఎదురుగా వస్తున్న మరో ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇద్దరు లేబర్ అక్కడికక్కడే చనిపోగా, పదిమందికి పైగా కాళ్లూ, చేతులూ విరిగాయి.

ఆ వార్త విన్నప్పటి నుండి, ఆ దృశ్యం చూసేక... మా బంతిలోని లేబర్ చాలా ఢీలాపడిపోయారు. పని సరిగా చేయటంలేదు.

మా మేస్త్రీ తీసుకున్న పని దాదాపు చివరి దశలో వుండగా, అమ్మకు పెద్ద జబ్బు చేసింది. కనీసం హాస్పటల్‌కైనా అమ్మని తీసుకెళ్లలేదు మేస్త్రీ.

ఎప్పుడూ దగ్గుతూ వుండేది అమ్మ. అమ్మ పనిలోకి రాకపోతే... మా గుడిసె దగ్గరకు వచ్చి, తిట్టి, కొట్టబోయేంత పనిచేసేది మేస్త్రీ భార్య.

''బాల్రాజా, ఏటి! మీయమ్మేటి ఇనాగయిపోతన్నాది రోజు రోజుకీనూ? ఆ కొండముచ్చు యెదవ కేటీ పట్టదా? పాలోమని మీ ఊరు నుండి గేదిల్ని తోలుకొచ్చేసినట్టు తోలుకొచ్చీడం తప్పించి, మీ బాగోగులూ, మంచీ సెడ్డా ఆడికక్కర్నేదా?'' అంటూ ముత్యాలమ్మ అమ్మని బలవంతంగా తనతోపాటూ కె.జి.హాస్పిటల్‌కి తీసుకెళ్లి, మందులు ఇప్పించేది.

ఆమె చేసే సేవలకూ, ఆ మంచితనానికీ, ఆమె దయాగుణానికీ మాకు ఆశ్చర్యం వేసేది. ఆమె ఎవరు? మేం ఎవరం? ఇంతవరకూ ఎన్నో వందల కిలోమీటర్ల దూరంలో వున్నాం. ఇప్పుడిలా కలవటం... ముత్యాలమ్మతో ఏ పూర్వజన్మ అనుబంధమో అన్పించేది.

మా చుట్టూ వున్న జోన్స్‌లో ఎక్కువగా పాలమూరులోని కొల్లాపూరు, వనపర్తి, నాగర్‌కర్నూలు, ఆత్మకూరు, గద్వాల, కల్వకుర్తి, అచ్చంపేట ఊర్లనుండి వచ్చిన వారు వున్నారు.

మాకు దూరపు బంధువులు కొందరు మా ఆచూకీ తెలుసుకొని, ఇతర జోన్ల నుండి వచ్చి, అమ్మని పలకరించి వెళ్లేవారు.

ఒకరోజు...

ఉదయం నుండీ వర్షం తుంపర్లు తుంపర్లుగా పడుతూనే వుంది. మధ్యలో వర్షం ఎక్కువవటంతో కాస్సేపు పని ఆపేరు. తలపైన గొడుగుతో అటుగా వచ్చిన మేస్త్రమ్మ అలా పనివదిలి ఖాళీగా వుండటం చూసి సహించలేకపోయింది.

''మీ తలలు గొట్ట! మీ కెమొచ్చిందిరా? మనకు ఎండేంది? వానేందిరా? లేవుండ్రి. పనిగాక నెత్తిగొట్టుకుంటుండము. మా నోట్ల మన్నువోసి బడపలు పాలమూరికి పారిపోయిరి. మీరన్న దబదబ పనిజేయకుంటే ఎట్లరా...'' అంటూ అందుకుంది.

ఆవిడ తిట్లకన్నా, వర్షంలో తడుస్తూ, పని చేయటంలోనే సుఖం వుందనుకున్న కూలీలు మెల్లగా పనిలోకి దిగేరు. అమ్మ నీరసంతో వున్నా... తలమీద కొంగేసుకొని తట్టా, పార తీసుకోక తప్పలేదు.

శ్రమ మరవడానికి ఆ వర్షంలోనే పాటలందుకున్నారు లేబర్.

*గోబిల్ల గరిల్లకింద నేరల్ల వనము*
*నేరల్ల వనముల్లా కోమల్లి పుట్ట*
*కోమల్లి పుట్టల్ల కోడే నాగన్నా*
*నాగన్న వెట్టేండు నాలుగూ గుడ్లు*
*శ్రావణ్ణి పెట్టింది శాటేడు గుడ్లూ*
*పెట్టి పెట్టి నాగన్నా మేతాడవాయే...*

నేను కొద్ది దూరంలో ముత్యాలమ్మ దగ్గరున్న తాటి గొడుగు కింద వుండి, వాళ్లు పాడే పాటల్ని వినసాగేను.

వర్షపుగాలికి పాట అటూ ఇటూ ఊగుతున్నట్లు అన్పించసాగింది. అమ్మను చూస్తుంటే కడుపు తరుక్కుపోయేది. ఆ వర్షంలో తప్పతడుస్తూ తట్టల్ని తలమీద కెత్తుకొని, మట్టిని ట్రాక్టర్లో పోస్తుంది.

బాగా చదువుకొని, మంచి ఉద్యోగం సంపాదించి అమ్మని సుఖపెట్టాలని వుండేది. ఐనా నన్నెవరు చదివిస్తారు? అప్పుడప్పుడూ ముత్యాలమ్మతో గాజువాక వెళ్లినప్పుడు బడికి వెళ్తున్న పిల్లల్ని చూసి చాలా దిగులు వేసేది.

ఆ వర్షంలో ఆడా, మగా అంతా పల్లెపదాల్ని వల్లె వేస్తూ, చాలా ఉషారుగా తిరుగుతున్నారు. ఐదారుగురు మగకూలీలు గునపాలతో పెద్ద సొచ్చెను (మట్టిపెల్ల) లేపాలని ప్రయత్నిస్తున్నారు. అంతకు క్రితం కూలిన సొచ్చెమట్టిని తట్టల్లోకి పారల్తో నింపి ట్రాక్టర్లలో పోస్తున్నారు.

వర్షం మరింత ఉధృతమయ్యింది.

అందరూ గునపాల్ని గజం గజం దూరంగా భూమిలోకి దించి, వాటిని వెనక్కీ, ముందుకీ ఊపుతూ మట్టిసొచ్చె కోసం ప్రయత్నిస్తూనే వున్నారు.

అన్ని దిక్కుల్ని కమ్మిన నల్లని మబ్బుకు చీకటి, చీకటిగా మసకలా వుంది అంతాను. ముత్యాలమ్మను గట్టిగా అదిమి పట్టుకొని కూర్చున్నాను.

టీ చేసే బొగ్గుల పొయ్యి ఎప్పుడో ఆరిపోయింది.

మళ్లీ పాటని గాల మోసుకొస్తూ, మా చెవుల కందిస్తోంది.

*చెట్ల సాటున, గుట్ల సాటునా*
*ఈతకల్లు తాగిస్తివ చిన్న సెంద్రమ్మా*
*ఏమెరుగని రామసెంద్రికి ఏం బెడ్తివో*
*మందు పెడ్తివో... మాకు పెడ్తివో*
*ఏం బెట్టీ రామసెంద్రిని మల్పుకుంటివో...*

'ఫెళ.... ఫెళ... ఫెళ...' ఎక్కడో పిడుగు పడినట్లు ఉరుముల శబ్దాలు. ఆ వెంటనే మాకు దగ్గర్లో మరేదో పెద్ద కోటగోడ కూలిన చప్పుడులాంటిది విన్పించేసరికి భయపడ్డాను.

పాట ఆగిపోయింది.

ఆ వర్షపు హోరులో ఎవరివో పెద్ద పెద్ద అరుపులు విన్పిస్తున్నాయి. లేబర్ అంతా పెద్దగా అరుస్తూ కూలిన మట్టి సొచ్చె చుట్టూ చేరారు. ముత్యాలమ్మ నన్ను గొడుగు కిందే కూర్చోమని, తను కూలిన మట్టి సొచ్చె దగ్గరకు వెళ్లింది.

అంతలోనే పెద్దగా ఏడుస్తూ, రాగాలు తీయటం విన్న నాలో వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది. మెల్లగా నేనూ అడుగులు వేస్తూ ఆ గుంపు వైపు వెళ్లేను.

ముత్యాలమ్మ నన్ను వాటేసుకుని బావురు మంది.

ఎందుకంతా పోగయ్యారో? అసలేం జరిగిందో అర్థంకావటం లేదు.

లేబర్ కూలిన మట్టిసొచ్చెను కంగారుగా పొడుస్తూ, మట్టిని లాగేస్తున్నారు.

అప్పుడు అర్థం అయ్యింది- అది కూలినప్పుడు ఎవరో దానికింద పడిపోయి ఉంటారని. అంతే! ఒక్క సారిగా తొలగించిన మట్టిలోంచి అమ్మ ఎర్రని చీర కన్పించేసరికి అలాగే చూస్తూ కొయ్యబారిపోయాను.

"అమ్మా!" అని అరుస్తూ, ఆ వర్షంలో కూలిన సొచ్చె చుట్టూ పిచ్చెక్కినట్లు గెంతుతూ ఏడుస్తున్న నన్ను ముత్యాలమ్మా, తక్కిన కూలీలు గట్టిగా పట్టుకున్నారు.

పడ్డ సొచ్చెలోంచి మరో పది నిమిషాల్లో కర్రలా నిగడదన్ని వున్న మా అమ్మను పైకి తీశారు. బ్రతుకంతా చీకటయిన క్షణాలవి.

నాన్న అనారోగ్యం కోసం అప్పుచేసి, దాన్ని తీర్చే మార్గంలేక, మేస్త్రీ మాట ప్రకారం కూలీగా విశాఖ వచ్చి, ఈ ఉక్కుపొరల్లో నలిగిపోయింది అమ్మ.

దగ్గర్లో వున్న శ్మశానంలో అమ్మను పూడ్చిపెట్టారు. మా ఊళ్లోనూ మాకు మరీ దగ్గర బంధువులు లేని కారణంగా శవాన్ని పాలమూరు తీసుకెళ్లలేదు.

అమ్మ చనిపోయేక దాదాపుగా ముత్యాలమ్మ దగ్గరే వున్నాను. మా మేస్త్రీ పైకి జాలి చూపిస్తూ, లోలోపల 'అప్పు ఎగ్గొట్టి సచ్చింది ముండ,' అనుకొని వుంటాడు.

ఇప్పుడు నా భారంతో చిరాకు కల్గుతోంది వాళ్లకి.

నేనొక ప్రశ్నగా మిగిలిపోయాను.

మా ఊళ్లో వున్న పూరిగుడిసె... అదీ మరొకరి దయతో వాళ్ల స్థలంలో వేసుకుంది. నాకంటూ వేరే ఆస్తి ఎక్కడా లేదు.

వలస వచ్చిన కూలీలు ప్రమాదవశాత్తూ చని పోతే, ఏ రకమైన నష్టపరిహారం చెల్లించకపోగా, అప్పు తీరలేదన్న కోపంతో చనిపోయినవాళ్ల వారసుల్ని పనిలోకి పెట్టుకోవటం మామూలే.

కానీ నా విషయంలో మరీ చిన్నవాణ్ణి. నాతో ఎంత పనిచేయించుకున్నా తక్కువే. నాకు పెట్టే భోజనం దండగ ఖర్చు అని మేస్త్రీకి, మేస్త్రమ్మకు వున్న సందేహం.

నన్ను ఎలా వదిలించుకోవాలో అని చూస్తున్న సమయంలో ముత్యాలమ్మ మా మేస్త్రీ దగ్గరకు వచ్చింది.

"ఇదిగో బాబూ! ఈ సంటోన్ని నా దగ్గిరొగ్గీసి ఎల్లండి. ఆడికేటి అమ్మా, అయ్యా? మీరున్నారెందుకూ, ఈడి తల్లికి ఒన్నవెట్టకంట మాడ్చీసినారు... బాల్రాజునీ సంపేత్తారు తవరు. సుబ్బరంగా ఒగ్గీయండిక్కడే. నా దగ్గిరే వుంతాడు. మావు తాగిన కలో, గెంజో ఈడికీ ఏసి పెంచుకుంతాము. మీరు ఒప్పీసుకుంతే నానొట్టుకెళ్లి

పోతాను,'' నిష్ఠూరంగా మాట్లాడుతూనే దర్జాగా అడిగింది ముత్యాలమ్మ.

నిజానికి నాకూ తిరిగి మహబూబ్‌నగర్ వెళ్లాలని లేదు. జీవితంలో నాకంటూ మిగలని అక్కడికి వెళ్లి ఏంచేయాలి?

దేవుడు పంపిన ప్రేమదూతలా వచ్చింది ముత్యాలమ్మ. ఏమనుకున్నాడో మేస్త్రీ, 'పీడా వదిలిందనుకున్నాడు' కాబోలు-

"గట్టనే బాలరాజును కొండవోగానీ, మాకు గీని తల్లి మూడువెయిల దాంక బాకున్నది. ఎయ్యి రూపాయల మిత్తి గూడ అయ్యింది. మరిగా అప్పు ఎవడు దీరుస్తడు? గీనితోన జెరజెర పని చేపించుకుంటే... తోడెమన్న తీర్తదంటని అనుకుంటుండ."

మేస్త్రీ మాటల్లోని నంగితనాన్ని కనిపెట్టింది ముత్యాలమ్మ. తిరిగి మాట్లాడకుండా వెళ్లిపోయి, వారం తర్వాత డబ్బుతో వచ్చింది. అమ్మ చేసిన బాకీని వడ్డీతో సహా మేస్త్రీకి అప్పజెప్పింది.

తర్వాత నా చేయి తన చేతిలోకి తీసుకుంది. కళ్లతోనే నన్ను ఆహ్వానించింది. నాకంటూ వున్న బట్టా, బుట్టా సర్దుకొని ముత్యాలమ్మతోపాటూ గాజువాకలో వున్న ఆమె ఇంటికి వచ్చేశాను.

చనిపోయిన మా అమ్మని ముత్యాలమ్మలో చూసుకునేవాణ్ణి. నా చేత ఏపనయినా చేయిస్తుందనుకున్నాను మొదట్లో.

నన్ను తిన్నగా గాజువాకలోని బడికి తీసుకెళ్లింది. బళ్లో నన్ను చేర్పించి, నాకు కావలసిన పుస్తకాల్ని కొన్నది.

నా ఆనందానికి అవధులు లేవు. అలాగే సంభ్రమాశ్చర్యాలతో ముత్యాలమ్మకేసి కళ్లప్పగించి చూసేను.

"ఏట్రా బాలరాజూ! అల్గ సూత్తన్నవేట్రా? నాకు పిల్లలు నేకపోయినా, నాకు కొడుకు నాటోడివిరా నివ్వు. నాను నిన్ను సూసిన యాళా ఇసేసమేటోగానీ, పూరజలమలో నా కొడుకునాగగుపించినావు. నా పెనిమిటికి పిల్లలంతే బోల్డు ఆసి. కానేట్నేబం? మాకు పిల్లల్నీయినేదు దేముడు. ఇదిగో నీ రూపాన్ని పంపినాడు. నీకూ అమ్మా, బాబూ కరవయిపోనారు. మా దగ్గిరే వుంతూ సుబ్బరంగా సద్వేయ్."

చాలారోజులుగా ముత్యాలమ్మతో సహవాసం వుంది గనక, ఆమె మాటల్ని పూర్తిగా అర్థం చేసుకుని, తను చెప్పిన మాటలు అర్థం అయ్యాయని తల ఊపేను.

స్టీల్ ప్లాంట్ కట్టడానికి కావలసిన స్థలం 'లెవల్'గా అయ్యేవరకూ, దాదాపు నాందీదశ పూర్తి కావస్తుండగా వెళ్లి 'టీ' అమ్మటం మానేసింది ముత్యాలమ్మ.

తర్వాత ఎన్నో వ్యాపారాలు చేసింది.

పచ్చి పెండలం దుంపల్ని విశాఖ చుట్టూ వున్న పల్లెల్నుండి తెచ్చి, ఉడకేసి పూర్ణమార్కెట్‌లో అమ్మి, డబ్బులు గడించేది.

కొన్నాళ్లు మామిడిపళ్ల వ్యాపారం, మరికొన్నాళ్లు కూరగాయలమ్మటం-ఎన్నో రకాలుగా.... మనిషి ఖాళీగా వుండకుండా ఏదో ఒకటి చేసేది.

జీవితం పైన గొప్ప ఆశ తనకి.

నా జీవితంలో ముత్యాలమ్మ కొత్త వెలుగు. కాలచక్రంలో ఆమె భర్త గతించేడు.

నేను ఇంటర్ పాసయ్యాక, ఇంజనీరింగ్ చదవాలని నాకు ఆశగా వుండేది. కానీ ముత్యాలమ్మ ఆర్థిక స్థితి నాకు తెలుసు గనక బయటకి చెప్పలేకపోయాను.

నా మనసులో మాట ఎలా కనిపెట్టిందో... ససేమీరా నా చదువు ఆగడానికి వీల్లేదని, తన పుట్టింటి వాళ్లు పసుపు కుంకాల కింద ఇచ్చిన స్థలం భీమ్లీలో వుంటే దాన్ని అమ్మి, నా చదువును కొనసాగించింది.

ఆంధ్రా యూనివర్శిటీలోనే ఇంజనీరింగ్‌లో సీట్ రావటం, చదువు అయిపోయేక కొన్నాళ్లకి తిరిగి స్టీల్ ప్లాంట్‌లోనే ఉద్యోగం రావటం అంతా యాదృచ్ఛికమే అయినా అదంతా ముత్యాలమ్మ చలువే.

నా చర్మం వలిచి, చెప్పులు కుట్టించినా ముత్యాలమ్మ ఋణం తీర్చుకోలేను. అన్ని వ్యాపారాలు చేసి అలిసిపోయిన ముత్యాలమ్మను నేను ఉద్యోగంలోకి వచ్చేక బలవంతంగా ఏ పనీ చేయనీయకుండా ఇంట్లో వుంచేను.

ఇప్పుడు గతాన్ని నెమరు వేసుకుంటూ, నా ఎదుగుదలని గొప్పగా అనుభూతి చెందుతూ.... నన్ను పెంచిన తల్లిగా విశ్రాంతి తీసుకుంటోంది.

*

ఇదంతా వారికి కట్టుకథలా తోచినా ఆశ్చర్యపోను. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం నా కన్నతల్లి ఈ ఉక్కులో సమాధి కావటానికి పరోక్షంగా కారకులైన ఈ మేస్త్రీలు, కాంట్రాక్టర్లూ... నా దృష్టిలో మమతానురాగాలకు అతీతులు.

నెలక్రితం నా కళ్లముందే కాలుజారి పడిన నూకాలమ్మను అలా చూస్తూ వుండిపోయిన మిగతా స్టాఫ్‌ని ఏమనాలో అర్థంకాలేదు.

గబగబా వెళ్ళి నా రెండు చేతులతో ఎత్తి, అంబులెన్స్ కోసం పరిగెత్తాను. ఫ్లోర్‌లోని మా స్టాఫ్ ఆశ్చర్యంతో నావైపు చూస్తుండటం నేను గమనించకపోలేదు.

ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటున్న నూకాలమ్మ ఆక్సిడెంట్ విషయంలో పరిహారంగా పదివేలయినా చెల్లించాలని డిమాండ్ చేసేను ఆమె తరపున.

నా హయ్యర్ రాంక్ ఆఫీసర్లు నా జోక్యం అనవసరమని చీవాట్లు వేశారు. అది మనకూ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన విషయం కాదన్నారు.

అయినా.... నా పట్టు వీడలేదు నేను.

నా అంతరంగంలోని అలజడిని వారు అర్థం చేసుకుంటారనుకోవటం నా భ్రమే! నా గతాన్ని టూకీగా వాళ్లకు చెప్పి, ముత్యాలమ్మతో నా అనుబంధాన్ని వివరించేసరికి ఆశ్చర్యంతో నోరు తెరిచినా, తర్వాత వారి కళ్లల్లో నాపట్ల చులకనభావాన్ని నేను గమనించకపోలేదు.

చంటిపాపకు పాలిచ్చే తల్లిని బలవంతంగా విడదీసి, పనిచేయమంటూ ఆ కూలీని గద్దించే రాక్షసుల్ని నేనెరుగుదును.

తమ కళ్లల్లో అందమైన ఆడకూలీ కన్పిస్తే, నయానో, భయానో, మంతనాలతోనో తమ కాటేజీల్లోకి లాక్కువెళ్లిన కామాంధులను ఎరుగుదును.

తమ దృష్టిలో సరిగా పనిచేయలేని కూలీని కాళ్లతో తన్ని, కాండ్రించి మొహం మీద ఊసిన కరుడుగట్టిన కాంట్రాక్టర్లను.... ఎందర్నో చూసేను.

పొట్ట కోసం రోజుకు పన్నెండు గంటలు పనిచేసే దరిద్రదేవత సంతానంలోంచి వచ్చినవాణ్ని.

రెక్కల కష్టానికి తగినంత ఫలితం దక్కకపోయినా, మందుకో, మాకుకో తీసుకున్న చిన్న అప్పు కోసం జీవితాంతం రుణగ్రస్తులై బతుకుల్ని తాకట్టు పెట్టుకునే నిర్భాగ్యుల పుత్రుణ్ణి.

ఈ చక్రభ్రమణంలోంచి బయటపడి, ముత్యాలమ్మ దయతో అందలమెక్కిన అదృష్టవంతుణ్ని.

దేశంలోని అన్ని ప్రాంతాల్లో బారులు బారులుగా దారులు కడుతూ, తమ దారిని పూడ్చుకుంటున్న పాలమూరి వలసపక్షుల్లోని ఒక పక్షిని.

వలసగా విశాఖ వచ్చి, తిరిగి నివాసం చేరని పక్షిని కూడా.

"అయ్యాం వెరీ సారీ బాల్‌రాజ్!... నూకాలమ్మ విషయం గురించి ఆలోచిద్దాం," అంటూ ఒక్కొక్కరే వచ్చి, నా భుజం తడుతూ బాధను అభినయిస్తున్న మా స్టాఫ్‌నూ, కాంట్రాక్టర్ కృష్ణారావునూ ఆశ్చర్యంతోనూ, అనుమానంతోనూ చూశాను.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక , 15 అక్టోబర్ 1994*

